Namasthe Telangana Dt 02/11/17.

# రేయింబవళ్లు మెట్రో పనులు

## ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న మియాపూర్ స్టేషన్

## శరవేగంగా మెట్రోరైలు స్టేషన్ల సుందరీకరణ

## సీఎంఆర్ఎస్ అనుమతి తర్వాత ప్రధాని షెడ్యూలు ఖరారు



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

మరో 27 రోజుల్లో హైదరాబాద్ మెట్రోరైలు ప్రారంభం కానున్నది. నగరంలో జరుగనున్న అంతర్జాతీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా రానున్న ప్రధానమంత్రి మోదీ.. ఈ నెల 28వ తేదీన మెట్రోరైలును ప్రారంభించనున్నట్లు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి సంకేతాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. ప్రస్తుతం అధికారులు, సిబ్బంది స్టేషన్ల సుందరీకరణ పనుల్లో నిమగ్నమయ్యారు. గడువులోగా పూర్తిచేయాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాలు జారీ చేయడంతో మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి పర్యవేక్షణలో పనులు చకచకా సాగుతున్నాయి. నాగోల్-మియాపూర్ 30 కిలోమీటర్ల మెట్రోరైలు మార్గంలో అమీర్‌పేట్ ఇంటర్‌చేంజ్ స్టేషన్ మినహా మిగతా స్టేషన్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్, విద్యుత్ వ్యవస్థ, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, కోచ్‌లు సిద్ధమయ్యాయి. ఇప్పటికే నాగోల్-మెట్టుగూడ మధ్య ట్రయల్‌రన్ పూర్తికాగా, మెట్టుగూడ-బేగంపేట మార్గంలో టెస్ట్‌రన్ నిర్వహించారు. బేగంపేట నుంచి ఎస్సార్‌నగర్ వరకు ట్రయల్‌రన్, టెస్ట్‌రన్ నిర్వహించి రైల్వే సేఫ్టీ సర్టిఫికెట్ పొందితే 30 కిలోమీటర్ల మార్గం సిద్ధమైనట్లే. దీనిని మరో 15 రోజుల్లో పూర్తి చేయనున్నారు.

### మియాపూర్ స్టేషన్‌లో శరవేగంగా పనులు

మెట్రోరైలు ప్రారంభానికి ప్రధాని వస్తున్నట్లు సానుకూల సంకేతాలు రావడంతో మియాపూర్ స్టేషన్ ప్రారంభోత్సవానికి ముస్తాబవుతున్నది. ప్రస్తుతం స్టేషన్ సుందరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రంగురంగుల టైల్స్‌తో ఫుట్‌పాత్‌ను, స్టేషన్ పరిసరాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. స్టేషన్ పరిసరాల్లో ఉన్న చెట్లకు పేయింటింగ్స్ వేస్తూ మరిన్ని సొబగులు అద్దుతున్నారు. మరింత పచ్చదనం కోసం మొక్కలు నాటుతున్నారు. సర్వీస్ రోడ్లు, అటాచ్ రోడ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. మెట్రోను ప్రారంభించనున్న ఇనాగ్రల్ ప్లాజాను ప్రత్యేకంగా నిర్మిస్తున్నారు. నాగోల్-మియాపూర్ మార్గానికి కమిషనర్ ఆఫ్ మెట్రో రైల్ సేఫ్టీ(సీఎంఆర్ఎస్) అనుమతులు పూర్తయ్యాకే ప్రధాని అధికారిక షెడ్యూలు ఖరారయ్యే అవకాశం ఉన్నది. ప్రధానమంత్రి కార్యాలయం ఇప్పటికే ప్రాజెక్టు పనులపై వివరాలు తెలుసుకున్నది. సీఎంఆర్ఎస్ అనుమతులు వచ్చిన వెంటనే అధికారికంగా ప్రకటించనున్నది.



మియాపూర్ స్టేషన్ వద్ద శరవేగంగా కొనసాగుతున్న సుందరీకరణ పనులు